నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, మంగళవారం 13 ఆగస్టు 2024 YADADRI BHUVANAGIRI

## కేజీబీవీ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న కేజీబీవీ ఉద్యోగులు

బొమ్మలరామారం, ఆగస్టు12 : మండల కేంద్రంలోని కేజీబీవీలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు సోమవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ లక్ష్మి మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో, మానసికి ఒత్తిడితో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణ భారమై, నిరాశతో, పనిభారంతో గుండెపోటుతో మరణించిన ఉద్యోగులకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించడం లేదన్నారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ మహిళా ఉద్యోగులు శ్రీలత, శోభారాణి, పావని, సరిత, అనిత, లక్ష్మి, జబీన్, రమాదేవి, సునీత పాల్గొన్నారు.



యాదగిరిగుట్ట : మల్లాపురంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతు కె. జెండగే

# ఈ విద్యా సంవత్సరం నుంచే ఐఐహెచ్‌టీ

## ఎట్టకేలకు భూదాన్ పోచంపల్లికే ప్రఖ్యాత జాతీయ సంస్థ



కనుముక్కలలోని హ్యాండ్లూమ్ పార్కు

- తాత్కాలికంగా పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో నిర్వహణ
- తొలుత 60సీట్లతో తరగతులు ప్రారంభం
- ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల, ఫ్యాకల్టీ, స్టాఫ్ రిక్రూట్
- కనుముక్కలలో హ్యాండ్లూమ్ పార్కుకు మరమ్మతులు
- భవనాలు, వసతులు, అందుబాటులోకి వచ్చాక ఇక్కడికి తరలింపు

**భూదాన్ పోచంపల్లి నేతన్న కల సాకారమైంది. ఎన్నో ఏండ్లుగా నేత కార్మికులు చేస్తున్న ఆందోళనలు, విజ్ఞప్తులకు సార్థకత లభించింది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సిల్క్ సిటీకి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ మంజూరైంది. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు షురూ కానున్నాయి. తాత్కాలికంగా హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ క్యాంపస్‌లో ప్రారంభించనున్నారు.**

– యాదాద్రి భువనగిరి, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ)

భూదాన్‌పోచంపల్లి చేనేత రంగంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. పర్యాటక రంగంలో ఏకంగా ఉత్తర టూరిస్ట్ ప్లేస్‌గా నిలిచింది. తాజాగా పోచంపల్లికి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ మంజూరైంది. ఈ మేరకు చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్ జీఓ నంబర్ 11 విడుదల చేశారు. మార్చిలోనే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఐఐహెచ్‌టీ మంజూరు చేయగా.. ఎక్కడ ఏర్పాటు చేస్తారనేది స్పష్టత లేదు. పోచంపల్లితోపాటు గద్వాల పేరు కూడా ప్రముఖంగా వినిపించింది. కానీ అంతిమంగా సదుపాయాలు, వసతులు, చేనేత పరిశ్రమ, పెద్ద సంఖ్యలో కార్మికులు, హైదరాబాద్‌కు సమీపంలో ఉండటం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని పోచంపల్లిలోనే ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### తాత్కాలికంగా హైదరాబాద్‌లోనే..

వాస్తవానికి ఐఐహెచ్‌టీని కేంద్రం భూదాన్‌పోచంపల్లి మండలంలోని కనుముక్కలలో ఉన్న హ్యాండ్లూమ్ పార్కులో ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. ఇక్కడ 26 ఎకరాల పార్కు టీజీసీఓ (తెలంగాణ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ) ఆధీనంలో ఉంది. సమయాభావం వల్ల ఇనిస్టిట్యూట్‌ను హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ క్యాంపస్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేయనున్నారు. కనుముక్కలలో సదుపాయాలు కల్పించే వరకు పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ క్యాంపస్‌లోనే లీజ్ బేసెస్‌లో నడిపించనున్నారు. కనుముక్కలలో ఉన్న పార్కుకు మరమ్మతులు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఇది చెట్లు, చెత్తతో అస్తవ్యస్తంగా ఉంది. వీటిని తొలగించడంతోపాటు భవనాలను రెనోవేషన్ చేయనున్నారు. పూర్తి సదుపాయాల కల్పన తర్వాత హైదరాబాద్ నుంచి ఇక్కడికి తరలించనున్నారు. ఇదంతా జరుగడానికి ఏడాది నుంచి రెండేండ్లు పట్టే అవకాశం ఉంది.




### అకడమిక్ ఇయర్ ప్రారంభం ఇలా..

ఐఐహెచ్‌టీకి అనుమతి రావడంతో ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం కానున్నాయి. 2024–25 విద్యా సంవత్సరంలో తొలుత ఫస్టియర్ తరగతులు మొదలు కానున్నాయి. దీనికి సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు. ఒక్కో తరగతిలో 60 సీట్లు ఉంటాయి. ఒక్కో సంవత్సరానికి 60 సీట్లతో మూడు సంవత్సరాలు పూర్తయ్యేసరికి 180 సీట్లు నింపనున్నారు. డిప్లొమా ఇన్ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ (డీహెచ్‌టీటీ) కోర్సు అందుబాటులో ఉంది. ఇప్పటికే ఓపెన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. సెప్టెంబర్ 15వ తేదీ నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు జీవోలో పేర్కొన్నారు. మరోవైపు ఇనిస్టిట్యూట్‌కు సంబంధించి అధికారులు డీపీఆర్ రూపొందించే పనిలో ఉన్నారు.

### ఫ్యాకల్టీ, సిబ్బంది ఇలా..

ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం సంస్థ కొనసాగనుంది. 1: 25 రేషియో ప్రకారం ఫ్యాకల్టీని నియమించనున్నారు. ఫ్యాకల్టీ వివరాలను సైతం జీఓలో పేర్కొన్నారు. ప్రిన్సిపాల్, ఏడుగురు లెక్చరర్లు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అస్టిసెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇద్దరు అటెండర్లు, ఐదుగురు ల్యాబ్ అటెండెంట్స్ తదితరులు ఉంటారు. ఇక తొమ్మిది మందితో ఎగ్జిక్యూటివ్ కమిటీ ఉంటుంది. చైర్మన్‌గా హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ కమిషనర్, అంతర్గత సభ్యుడిగా సీనియర్ ప్రొఫెసర్, సభ్యులుగా ఇద్దరు అకాడమిషియన్స్, టెక్నికల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ, ఫైనాన్స్ ఆఫీసర్, ఇద్దరు పారిశ్రామిక ఎగుమతిదారులు, మెంబర్ సెక్రటరీగా ప్రిన్సిపాల్ ఉంటారు. కాగా ఐఐహెచ్‌టీ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు మాజీ మంత్రి కేటీఆర్ ఎన్నోసార్లు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు.

## వైద్య కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన

యాదగిరిగుట్ట, ఆగస్టు 12 : యాదగిరిగుట్టకు మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుకు కావాల్సిన స్థలాన్ని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతు కె. జెండగే పరిశీలించారు. మండలంలోని మల్లాపురం గ్రామంలో సర్వే నంబర్ 64లో సోమవారం అనువైన స్థలాన్ని వారు క్షేత్రస్థాయిలోకి వెళ్లి చూశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన 20 ఎకరాల భూమిని పరిశీలించి సాధ్యాసాధ్యాలపై చర్చించారు. త్వరలో తుది నిర్ణయం తీసుకొని మల్లాపురం గ్రామంలోనే వైద్య కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అమరేందర్, తాసీల్దార్ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.



భువనగిరి తాసీల్దార్ కార్యాలయానికి తాళం వేసి ఆందోళన చేస్తున్న డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు, అఖిలపక్షం నాయకులు

## డబుల్ బెడ్రూం ఇండ్లను వెంటనే అప్పగించాలి

- తాసీల్దార్ కార్యాలయ గేటుకు తాళం వేసి లబ్ధిదారుల ధర్నా

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 12 : డబుల్ బెడ్రూం ఇండ్లను లబ్ధిదారులకు వెంటనే అందించాలని అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేశారు. డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులతో కలిసి వారు సోమవారం తాసీల్దార్ కార్యాలయం గేటుకు తాళం వేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం అలసత్వం వహిస్తుందన్నారు. లబ్ధిదారులకు కేటాయించిన ఇండ్లను అప్పగించకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఇండ్లను అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తాసీల్దార్ అంజిరెడ్డికి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆబోతుల కిరణ్‌కుమార్, దిడ్డికాడి భగత్, బబ్లు, సుభాశ్, రాజశేఖర్, భిక్షపతి, బట్టు రామచంద్రయ్య, బట్టుపల్లి అనూరాధ, మాయ కృష్ణ, రత్నపురం బలరాం, చందా మహేందర్, ఏశాల అశోక్, పుట్ట రమేశ్, చింతల మల్లేశ్ పాల్గొన్నారు.

## నకిరేకల్ మున్సిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

నకిరేకల్, ఆగస్టు 12 : నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ (బీఆర్ఎస్)పై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. గత నెల 22న 16మంది కౌన్సిలర్లు చైర్మన్‌పై అవిశ్వాసాన్ని ప్రకటిస్తూ కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీంతో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు కౌన్సిలర్లకు నోటీసులు అందజేశారు. కలెక్టర్ ఆదేశాలతో ప్రిసైడింగ్ అధికారి, నల్లగొండ ఆర్డీఓ రవి సమక్షంలో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణితో పాటు 15మంది కౌన్సిలర్లు, కమిషనర్ డి.బాలయ్య, తాసీల్దార్ ఎస్కే జమీరొద్దీన్ హాజరయ్యారు. కోరం నిబంధన ప్రకారం 20మంది సభ్యుల్లో 14 మంది హాజరు కావాల్సి ఉండగా.. 16 మంది రావడంతో ఓటింగ్ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసానికి 16మంది కౌన్సిలర్లు మద్దతు తెలిపారని, వ్యతిరేకంగా ఎవరూ ఓటు వేయలేదని ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీఓ రవి తెలిపారు. అవిశ్వాసం రిపోర్టును కలెక్టర్‌కు అందజేస్తామని, కలెక్టర్ ఎలక్షన్ కమిషన్‌కు పంపిస్తారని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చైర్మన్ ఎన్నిక తేదీని నిర్ణయించనున్నట్లు చెప్పారు. దీంతో గత నెల 22నుంచి ఉత్కంఠ రేపుతున్న మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం ఎట్టకేలకు ముగిసింది. కాగా, 2021 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి 11మంది, ఏఐఎఫ్‌బీ నుంచి ఆరుగురు, కాంగ్రెస్ పార్టీ నుంచి ఇద్దరు, ఒకరు స్వతంత్ర అభ్యర్థి కౌన్సిలర్లుగా గెలుపొందారు.



భూదాన్ పోచంపల్లి బసవ లింగేశ్వర కాలనీలో నిర్మాణం పూర్తయి పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇండ్లు

# నెరవేరని సొంతింటి కల

- పేదలకు అందని డబుల్ బెడ్రూమ్ ఇండ్లు
- పంపిణీకి సిద్ధంగా ఉన్నా పట్టించుకోని సర్కార్
- అసాంఘిక కార్యకలాపాలు.. మందు బాబులకు అడ్డాగా మారిన వైనం

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 12 : పేదలకు సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పథకం తీసుకొచ్చింది. ఇండ్ల నిర్మాణం పూర్తయి పంపిణీకి సిద్ధంగా ఉన్నా.. పేదలకు కేటాయించడంలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం చేస్తున్నది. గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉండగా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దాంతో పేదలకు ఇండ్లు అందని ద్రాక్షగా మారాయి. ఈ క్రమంలో నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మందు బాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న పరిస్థితి నెలకొంది. గత బీఆర్ఎస్ సర్కార్ ఒక్కో నియోజకవర్గానికి వెయ్యి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను మంజూరు చేసింది. ఇంటి నిర్మాణం కోసం గ్రామీణ ప్రాంతాల్లో రూ.5.04 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.5.40 లక్షలు ఖర్చు చేసింది. ఈ క్రమంలో భూదాన్ పోచంపల్లి పట్టణంలోని బసవ లింగేశ్వరస్వామి కాలనీలో రూ.6.04 కోట్లతో 120 ఇండ్లు, జిబ్లక్‌పల్లిలో రూ.1.81 కోట్లతో 36 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టింది. ఇండ్ల కోసం భూదాన్ పోచంపల్లిలో 658 మంది, జిబ్లక్‌పల్లిలో 52 మంది పేదలు దరఖాస్తు చేసుకున్నారు. అర్హులను ఎంపిక చేసేందుకు జిబ్లక్‌పల్లిలో రెవెన్యూ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. భూదాన్ పోచంపల్లిలో అర్హులను ఎంపిక చేయాల్సి ఉన్నది. ఇంతలో ఎన్నికలు వచ్చాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పథకం ఆశించిన మేరకు ముందుకు సాగడం లేదు. నిర్మాణం పూర్తయి పంపిణీకి సిద్ధంగా ఉన్నా.. సర్కారు పట్టించుకోకపోవడంతో ఇండ్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఇండ్ల చుట్టూ పిచ్చిమొక్కలు పెరుగగా.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. గుర్తుతెలియని దుండగులు కిటికీ అద్దాలు పగులగొడుతున్నారు. పైపులు, వైర్లు చోరీ చేస్తున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల వద్ద స్తంభాలు నాటారు కానీ.. తీగలు లాగడం మరిచారు. సీసీ రోడ్డు ఏర్పాటు చేయలేదు. వసతులు కల్పించి అర్హులను గుర్తించి ఇండ్లు కేటాయించాలని పేదలు కోరుతున్నారు.

## సాగర్ క్రస్ట్ గేట్ల మూసివేత

- ఇన్‌ఫ్లో తగ్గడంతో దిగువకు నీటి విడుదల నిలిపివేత

నందికొండ, ఆగస్టు 11 : నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టడంతో ఎన్నెస్పీ అధికారులు సోమవారం డ్యామ్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను నిలుపుదల చేశారు. నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో భారీగా రావడంతో ఈ నెల 5న క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను ప్రారంభించారు. 5నుంచి 12వరకు రోజూ 2నుంచి 3లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. 8రోజుల పాటు 175 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఎన్నెస్పీ అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం 8 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగించగా.. ఎగువ నుంచి వరద ఉధృతి తగ్గడంతో క్రస్ట్ గేట్లను క్రమంగా తగ్గిస్తూ సోమవారం మధ్యాహ్నం 2గంటలకు పూర్తిగా నిలుపుదల చేశారు. వరద ఉధృతిని బట్టి క్రస్ట్ గేట్ల ద్వారా మళ్లీ నీటి విడుదల చేపడుతామని ఎన్నెస్పీ అధికారులు తెలిపారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 (312 టీఎంసీలు) అడుగులకు గానూ ప్రస్తుతం 588.80 (308.4658 టీఎంసీలు) అడుగుల మేర నీరు నిల్వ ఉంది. సాగర్ రిజర్వాయర్ పూర్తి స్థాయికి చేరుకోవడంతో నిండుకుండలా మారి జలకళను సంతరించుకుంది. కృష్ణా పరీవాహక ప్రాంతాల్లోని ఆల్మట్టి, నారాయణపుర్, జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు 1,29,430 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 47,319 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతుంది. ఎడమ కాల్వ ద్వారా 8,541 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 6,253, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,125, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుంది.

## బూరుగడ్డ వాసికి 7 ప్రభుత్వ ఉద్యోగాలు



గోపి

హుజూర్‌నగర్ రూరల్, ఆగస్టు 12 : మండలంలోని బూరుగడ్డ మాచవరం గ్రామానికి చెందిన చింతలచెర్వు గోపి ఏడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించుకున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో పంచాయతీరాజ్ ఏఈఈ ఉద్యోగం పొందగా.. అంతకు ముందు జీహెచ్‌ఎంసీలో టెక్నికల్ అసిస్టెంట్, రైల్వేలో గ్రూప్ – డీ ఉద్యోగం, పంచాయతీ కార్యదర్శి గ్రూప్ –4, పాలిటెక్నిక్ లెక్చరర్ ఉద్యోగాలు సాధించారు. గ్రూప్ –1 ప్రిలిమ్స్‌లో అర్హత సాధించి మెయిన్స్‌కు సిద్ధమయ్యారు. గోపి చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయినా నిరాశ, నిస్పృహలకు లోనుకాకుండా ఆత్మవిశ్వాసం, పట్టుదలతో చదివి ఏకంగా 7 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం గర్వకారణమని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలో ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పి మోటివేటర్‌గా ఉన్న గోపి చిన్నాన్న చింతలచెర్వు ఉపేందర్ పర్యవేక్షణలో సాధించిన ఈ విజయాలు గ్రామ యువతతో పాటు ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. గోపిని గ్రామ యువత సన్మానించి మరెన్నో విజయాలు సాధించి గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు.

# వెల్మినేడులో ఫార్మాసిటీ?

## ఏర్పాటు చేయనున్నారని జోరుగా ప్రచారం

- అదేం లేదంటున్న అధికారులు
- ఇప్పటికే ఈ ప్రాంతంలోని కంపెనీలతో కాలుష్యం
- ఫార్మాసిటీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రైతులు, ప్రజలు
- గతంలో భూసేకరణ సర్వే అడ్డగింత



గతంలో ఇండస్ట్రియల్ పార్కు కోసం వెల్మినేడులో ప్రభుత్వం సేకరించిన భూమి

చిట్యాల, ఆగస్టు 12 : మండలంలోని వెల్మినేడులో ఫార్మాసిటీ ఏర్పాటు చేయనున్నారని మీడియాలో కథనాలు వస్తుండటంతో ఆ ప్రాంతానికి చెందిన రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో ఉన్న ఫార్మా కంపెనీల వల్ల పంట పొలాలు దెబ్బతిని రైతులు, కాలుష్యాన్ని తట్టుకోలేక ప్రజలు ఇబ్బంది పడుతుండగా ఏకంగా ఫార్మాసిటీని నిర్మిస్తారని ప్రచారం జరుగుతుండటంతో స్థానికుల్లో కలవరం మొదలైంది. గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం ముచ్చర్లలో పెద్దఎత్తున భూసేకరణ చేసింది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానంతో ఆ ప్రాంతంలో ఫార్మాసిటీని రైతులు వ్యతిరేకిస్తున్నారు. దీంతో ప్రభుత్వం కూడా ఒకే ప్రాంతంలో ఫార్మాసిటీ నిర్మిస్తే వ్యతిరేకత వస్తున్నందున రాష్ట్రంలోని దాదాపు 10 ప్రాంతాల్లో ఫార్మాసిటీలను నిర్మించటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తుంది. అందులో భాగంగా నల్లగొండ జిల్లాలోని వెల్మినేడులో ఫార్మాసిటీని నిర్మించాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాంతమైతే ప్రభుత్వ ఆలోచనా విధానాలకు అనుగుణంగా ఉండటంతో ఇక్కడే ఫార్మాసిటీ నిర్మిస్తారని అంటున్నారు. అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు దగ్గరలో, దేశంలోని ప్రధాన రహదారులలో ఒకటైన 65వ నంబర్ జాతీయ రహదారిని ఆనుకొని ఉండటం, ఇప్పటికే ఈ ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కు కోసం భూసేకరణ జరుగడం వంటివి ప్రభుత్వానికి అనుకూలించే విషయాలు.

### గతంలో డ్రైపోర్టు, ఇండస్ట్రియల్ పార్కుకు సన్నాహాలు

మొదట ఇక్కడ ఉన్న ప్రభుత్వ భూముల్లో డ్రైపోర్టు నిర్మిస్తారని ప్రచారం జరిగినప్పటికీ తదుపరి ఇండస్ట్రియల్ పార్కు కోసం అని ఈ ప్రాంతంలో ఉన్న 162.28 ఎకరాల ప్రభుత్వ భూమికి ఆనుకొని గతంలో రైతులకు పంపిణీ చేసిన 313 ఎకరాల భూమిని కూడా స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేశారు. ఇందు కోసం సర్వే చేయడానికి అధికారులు వెళ్లగా ఆ ప్రాంతానికి చెందిన రైతులు అడ్డుకున్నారు. దీంతో ఆ ప్రక్రియ అక్కడితో నిలిచిపోయింది. ఇదే ప్రాంతంలో మరి కొంత భూమిని సేకరించి ఇండస్ట్రియల్ పార్కు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తున్నప్పటికీ స్థానిక అధికారులు మాత్రం తమకు ఎలాంటి సమాచారం లేదని అంటున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే వెల్మినేడు, పిట్టంపల్లి గ్రామాల మధ్య ఉన్న కెమికల్ కంపెనీలు వెదజల్లుతున్న కాలుష్యంతో ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటుండగా జీవాలు కూడా అనారోగ్యం బారిన పడుతున్నాయి. పంటపొలాలు దెబ్బతింటుండటంతో రైతులు, ప్రజలు పలు సందర్భాలలో ఆందోళనలు నిర్వహించారు .కాగా కొత్తగా ఫార్మా సిటీ నిర్మిస్తే పదుల సంఖ్యలో ఫార్మా కంపెనీలు వస్తాయని, జనజీవనం పూర్తిగా దెబ్బతింటుందని పలువురు పేర్కొంటున్నారు. ఇటాంటి ఆలోచనను ఆరంభంలోనే వ్యతిరేకించాలని పలువురు పర్యావరణ ప్రేమికులు తెలియజేస్తున్నారు.

### ఫార్మాసిటీ వస్తే తీవ్రంగా వ్యతిరేకిస్తాం



ఈ ప్రాంతంలో ఫార్మాసిటీని నిర్మిస్తే ప్రజలు, రైతుల సహకారంతో తీవ్రంగా వ్యతిరేకిస్తాం. ఇప్పటికే ఈ ప్రాంతంలో ఉన్న కంపెనీలతో కాలుష్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఆ కంపెనీలు కాకుండా కొత్త కంపెనీలు వస్తే వాటిని ఏర్పాటు చేయకుండా ప్రతిఘటిస్తాం. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామన్న ప్రాంతంలో కాలుష్య రహిత కంపెనీలే నిర్మించాలి.

-దేవరపల్లి సత్తిరెడ్డి, వెల్మినేడు మాజీ ఎంపీటీసీ

### కలెక్టర్ ఉత్తర్వులు రాలేదన్నారు



ఫార్మాసిటీ నిర్మాణంపై వస్తున్న వార్తల నేపథ్యంలో కలెక్టర్‌ను కలువగా అలాంటిదేమీ లేదని చెప్పారు. భూ సేకరణకు కూడా ఉత్తర్వులు రాలేదన్నారు. ఒకవేళ ఈ ప్రాంతంలో ఫార్మాకంపెనీ వస్తే రైతు శ్రేయస్సు కోసం వ్యతిరేకిస్తాం.

-బొంతల చంద్రారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు

### ఎలాంటి ఆదేశాలు రాలేదు

కొత్తగా భూ సేకరణ కోసం మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. గతంలో ఉన్న ఉత్తర్వుల ప్రకారం అప్పట్లో భూసేకరణ కోసం సర్వే నిర్వహించడానికి వెళ్లగా రైతులు వ్యతిరేకించిన విషయం తెలిసిందే.

-డి. కృష్ణ, చిట్యాల తాసీల్దార్